# అంతర తరంగాలు

"మావా! నూకలు లేవు... యింకా బాడుగ రాలేదా?" రంగి సూరయ్య దగ్గరికి వచ్చి అడిగింది.

సెంటర్లో మిగతా వాళ్ళతోపాటు రిక్షా కట్టుకుని నిల్చున్న సూరయ్యకు చిర్రెత్తుకొచ్చింది. గంటకుపైగా సెంటర్లో ఉన్నా ఒక్కళ్ళూ రిక్షా ఎక్కలేదు.

అప్పటికి ఓ బేరం కుదురిఉండేది కానీ తను నాలుగు రూపాయలు చెబితే - వాడు మూడు అన్నాడు. డబ్బున్న మా రాజులే బేరం ఆడితే ఇంక చెప్పేదేంటి. తను న్యాయంగా చెప్పాడు. రెండు కిలోమీటర్లపైన అప్పు తొక్కాలి ఎదురుగాలికి. అప్పటికీ తన దరిద్రం కొద్దీ ఒప్పేసుకుండును కానీ పక్కన నిలబడి వింటున్న చంద్రం రాదని చెప్పేశాడు. చంద్ర యూనియన్ లీడరు. అతన్ని కాదని కట్టినా గొడవవుద్ది.

"ఛెస్! రాలేదే!" ఉమ్మిస్తూ అన్నాడు.

"ఎలా ... బిడ్డలు ఆకలికి నకనకలాడుతున్నారు." రంగి జీరగొంతుతో చెప్పింది.

"సన్నాసి ఎదవలు - ఆకలికి తట్టుకోలేరు"పోని సెట్టి అంగట్లో అప్పు తీసుకోయే!"

"లేదు మావా-యివ్వడంట సచ్చినోడు... యిప్పటికీ నూరుదాటే వుందంట బాకీ"... దిగులుగా చెప్పింది.

చంద్రం వచ్చాడు... జేబులోంచి ఓ అయిదు తీసి రంగికిచ్చాడు.

"తీసుకో రంగీ... మళ్లీ నే తీసుకుంటా ఈడి దగ్గర "థాంక్సన్నా!" చేతులెత్తి దండం పెట్టింది.

సూరయ్యకు కూసింత కోపం వచ్చింది. తనడిగితే యిందాక యివ్వలేదు. ఆడ కూతురొచ్చిందనియిచ్చాడుఈ ఎదవ. ఆమె దగ్గర మంచివాడు కావాలి. ఎదవ బుద్దులు-ఛీ!

"ఏయ్! రిక్షా! వస్తావా?" ఎవరో జంట రిక్షా కోసం వచ్చారు. బట్టలు చూస్తే బాగానే ఉన్నారు ఆడమొగ

"వస్తా కానీండి బాబయ్య, నా పేరు ఏయ్ కాదు సూరయ్య.." సూరయ్య చెప్పాడు.

"సరేలే... పాత బస్టాండ్‌కు ఏమి తీసుకుంటావు?" దర్పంగా అడిగాడు అతను.

"ఒకరా...యిద్దరా?"

"కనపడ్డంలా...యిద్దరం".

"పాత బస్టాండ్ దగ్గర దిగుతారా...లోపలికి తీసుకుపోవాలా?"

"బస్టాండ్‌లో దిగుతాంలే...ఎలా చెప్పు" ఆమె విసుక్కుంది.

"అయిదు రూపాయలండి"

"అయిదా? ఎంత దూరముందనుకున్నావో? బస్సులో పోతే రూపాయిన్నరతో పోతుంది." అతను కోపంగా అన్నాడు.

"..దేని రేటు దానిదేనండి..ఆటోలోపోతే పది రూపాయలు అవుతుందండి. సైకిల్‌పైపోతే పావలా ఖర్చేనండి. నడిచిపోతే ఫ్రీ!"

అతను మొహం చిట్లించాడు సూరయ్య అధిక ప్రసంగం ఇష్టంలేనట్టు ఆమె వంక చూశాడు.

"వచ్చేమాట చెప్పు - నాలుగు యిస్తాం" ఆమె అంది. నిజానికి నాలుగు తక్కువే! కాని ఎప్పటినుండో బాడుగలు లేవు. దరిద్రం! ఈ సెంటర్లో బాడుగలే తక్కువ. పాత బస్టాండుకైనా పోతే తగులు తాయేమో! పైగా ఆమె చాలా అందంగా ఉంది. కాదనలేకపోయాడు సీటు దులిపి కూర్చోమన్నాడు.

వాళ్ళు ఎక్కగానే నిదానంగా తొక్కసాగాడు.

"కొంచెం తొందరగా పోనీ!"

"రోడ్డు బాగోలేదండి.. ఇంతకంటే స్పీడుగా పోతే ఎగిరెగిరి పడతారండి" నిర్లక్ష్యంగా చెప్పాడు.

"వాటే హెల్!" అతను విసుక్కున్నాడు.

"ఊరుకో డార్లింగ్! డాక్టర్ ఉంటాడులే".

"అదికాదు మల్లీ... కొంచెం టైం దొరికితే.. అలా సినిమాకు పోయొద్దామని.."

"చాల్లెండి. నెలాఖరు రోజుల్లో సినిమాలేమిటి? డాక్టర్‌కు పది రూపాయలు ఫీజు యివ్వాలా? మందులు ఎంత అవుతాయో" మల్లిక అంది.

"అబ్బా! డబ్బు గురించి నువ్వు ఆలోచించకు. అప్పులిచ్చే మారాజులు ఎంత మంది దండిగా లేరు"

"ఎప్పుడూ అప్పు అప్పంటారు... ఊరికే కాదుగా ఎప్పటికైనా తీర్చవలసిందేగా!"

"నందో రాజ భవిష్యతీ. ప్రస్తుతానికి రొటేషన్‌కి వస్తే చాలు."

కాసేపటికి డాక్టర్ డిస్పెన్సరీ ముందు ఆగింది. డబ్బులిచ్చి రిక్షా పంపించేశాడు.

కాసేపటికి తమ వంతు వచ్చింది డాక్టర్ దగ్గర.

"నా పేరు మూర్తి! ఇక్కడ బ్యాంకులో పని చేస్తున్నాను, నా భార్య మల్లిక. తరుచుగా బావుండటం లేదు" అంటూ ఆమె కొచ్చే కంప్లయిట్స్ చెప్పసాగాడు.

డాక్టర్ ఆమెని లోపలికి తీసుకుపోయి పరీక్షలు జరిపి బయటకు వచ్చాడు.

"ప్రస్తుతానికి ఈ మందులు వాడండి. ఓ నాలుగు రోజుల తర్వాత వచ్చి కలవండి. ఓ ఇంజక్షన్ కూడా చేస్తాను."

అంటూ డాక్టర్ ఓ ఎర్రటి యింజెక్షన్ ఆమె జబ్బలోకి గుచ్చాడు. అబ్బా అంది ఆమె.

మెడికల్ షాపులో విచారిస్తే ఆ మంధుల ఖరీదుయాభై దాటింది. సందిగ్ధంలో పడిపోయాడు. అతనురాసినవి అన్నీ కొనాలా. కొన్నే కొనాలా! నాలుగు రోజులకు కొనాలా? రెండు రోజులకి కొనాలా అని...

చివరికి తెగింపు చేసుకుని మొత్తం కొన్నాడు.

"ఇది ఉంచండి. పది రూపాయలు రేపిస్తాను.నేను ఇక్కడి బ్యాంకులో పని చేస్తూ ఉంటాను."..

మందుల షాపువాడు తలాడించాడు.

"ఆకలేస్తున్నది... ఈ ఇంజెక్షన్ దెబ్బకు నీరసంగా ఉంది. హోటల్‌కు వెళదామా..." మల్లిక అడిగింది.

మూర్తి జేబు చూసుకున్నాడు. పది దాకా ఉంది.

"సరే పద. వెళ్లేటప్పుడు బస్సులో వెళ్లిపోదాం" ఎదురుగా ఉన్న మంచి హోటల్‌లోకి దారి తీశారు ఇద్దరూ...

సర్వరుకు ఆర్డరిచ్చి ఎదురుగా కూర్చున్న ఖరీదైన వ్యక్తిని చూడసాగాడు మూర్తి.

అతన్ని చూస్తే ఎక్కడో చూసినట్లుంది.

"హల్లో మూర్తి!" ఉన్నట్టుండి అతను పిల్చాడు. ఉలిక్కిపడ్డాడు. "మిమ్మల్ని గుర్తుపట్టలేదు."

"నేను రాజుని. అదే రాజశేఖర్‌రావును. టెన్త్‌లో మనం క్లాస్ మేట్స్! గుర్తుపట్టావా?" అతను గుర్తుచేశాడు.

మూర్తి షాక్ నుండి కొన్ని నిముషాల దాకా తేరుకోలేకపోయాడు. వట్టి ఊత ఫెలో చిన్నప్పుడు. ఇప్పుడు బిజినెస్ మ్యాగ్నెట్. తను చిన్నప్పుడు బ్రిలియంట్.. ఇప్పుడు కూడికలు-తీసివేతలు చేసే గుమాస్తా..

రాజశేఖర్ కారేసుకుని ఇంటికివచ్చాడు.అప్పటికీ కొందరు పెద్ద మనుషులు అతని కోసం కాచుకూర్చున్నారు.

మళ్ళీ పెట్టబోయే కొత్త కంపెనీ గురించి డిస్కస్ చేశారు. వాళ్ళు పోయేటప్పటికి రాత్రి అయ్యింది.

ఆఫీసు రూము వదలి ఇంటికి వచ్చేసరికి అతని భార్య శ్రీ లక్ష్మి రకరకాల నగలు ముందేసుకుని పరిశీలిస్తున్నది. అతనికి విసుగొచ్చింది.

"ఏమండీ.. వీటిల్లో ఏ నెక్లెస్ బాగుందంటారు? నాకైతే ఈ ఎర్రడైమండ్ నెక్లెస్ బాగుంది. - లక్ష పైన ఉంటుంది."

"ఇప్పుడు నెక్లెస్ అంత అవసరమా?"

"అవసరమా? వచ్చే పండక్కి పాత నగలు వేసుకోవాలా"! ఆశ్చర్యంగా అడిగింది.

"ఈ సారికి.. సర్దుకుంటే బాగుంటుంది" చిన్న బుచ్చుకుంటూ చెప్పాడు.

"బాగుంది.. డబ్బంటే వస్తూ ఉంటుంది.. పోతూంటుంది పండగలు మాట మాటికి వస్తాయ్యా'!'

"ప్లీజ్! ఈ ఒక్కసారికి అడ్జెస్టు చేసుకో.. చాలా టైట్‌గా ఉంది నా పొజిషన్"

"హూ! మీరు అందరిలాంటి మొగాళ్ళనిపించారు. పెళ్ళాంకు నగకొనాలంటే ఎక్కడ లేని ఖర్చులు కనిపిస్తాయి. మీ విస్కీలకు, విలాసాలకు ఎంత ఖర్చవుతుందో లెక్క తెలీదు.. హూ" కోపంగా బుసలుకొట్టింది.

"పోనీ... డబ్బులు వచ్చే నెల యివ్వచ్చా!"

"ఆ వాడు ఒప్పుకుంటాడు. మనకే ప్రెస్టేజిపోతుంది. ఆఫ్టరాల్. ఓ రెండు లక్షల కోసం బాకీ పెట్టారంటే.. విన్న వాళ్ళు ముక్కుమీద వేలేసుకుంటారు" శ్రీలక్ష్మి నిరసనగా అంది.

"ఏనాడు నువ్వు నాకష్టాన్ని అర్థం చేసుకున్నావు కనుక - నీ యిష్టం వచ్చినట్లు చెయ్యి."

"ఆ మాటేదో ముందే చెప్పి ఉండచ్చుకదా!" శ్రీలక్ష్మి అంది.

రాజశేఖర్‌కు కోపం వచ్చింది. మౌనంగా వచ్చి కారెక్కాడు. గమ్యం తెలిసిన కారు ఓ బారు ముందాగింది.

తను ఎప్పుడూ కూర్చోనే టేబుల్ మీద కూర్చున్నాడు. బేరర్ అతనికి అలవాటయిన డ్రింక్స్ తెచ్చి టేబుల్ మీద సర్దాడు. డ్రింక్ తీసుకోవడం ప్రారంభించాడు. డాక్టర్ అతని ముందు వచ్చి కూర్చున్నాడు వచ్చి..

"హాయ్ డాక్టర్ రావు!"

"హాయ్ రాజా!"

"ఇవ్వాళ లేటయింది రావడం"

"జస్ట్ లాస్ట్ మినిట్‌లో సీరియస్ కేసు వచ్చింది. ట్రీట్‌మెంట్ యిచ్చి పైకి పంపించేసరికి లేటయింది."

రాజశేఖర్ నవ్వాడు... "హోహో.. పైకి పోతాడు అని తెల్సినప్పుడు ట్రీట్‌మెంట్ ఎందుకివ్వడం... ఫీజు కోసమా?"

"ఫీజా! ఎలాగూ యిస్తారు?... కాని వాళ్ళ తృప్తికోసం... ఏవేవో అక్కరలేని మందులిచ్చి వాళ్ళకు ఫుల్ సాటిస్‌ఫాక్షన్ కలిగించా. మా డాక్టర్ చాలా సిన్సియర్‌గా ట్రై చేసినా.. మన బ్యాడ్‌లక్ కొద్దీ ఎక్సపయిర్ అయ్యాడని సర్ది చెప్పుకుంటారు.." డాక్టర్ రావు సిప్ చేస్తూ చెప్పాడు.

"అందుకే డాక్టర్ లైఫ్ బెస్ట్!"

"నీ బిజినెస్ కంటేనా?"

"ఆ! నీది పెట్టుబడిలేని వ్యాపారం. దీంట్లో నష్టం అంటూ లేదు. అంతా లాభాలే!" రాజశేఖర్ అసూయతో అన్నాడు.

"ష్ట్! మాది పెట్టుబడి లేని వ్యాపారం కాదు. మా పెట్టుబడి అంతా చదువుకునేటప్పుడే పెట్టేశా... ఇంక డిస్పెన్సరీకి కాపిటల్ కావాల్సిందేగా... నష్టమంటావా? నాలుగు కేసులు బకెట్ తన్నేస్తే... అయిదో కేసు రాదు.. నీది.. నష్టాలొచ్చినా ,అలా ప్రకటించినా, ఆ డబ్బంతా నీ బీరువాల్లో చేరుతుంది. నష్టమంటావా. మహా అయితే నీ వర్కర్లకు వస్తాయి. వాళ్ళ జీతాలు ఎగ్గొడతావు" రావు చెప్పాడు.

"షటప్ అండ్ గెటవుట్ యూ రాస్కెల్", అరిచాడు రాజశేఖర్.

"నిజం చెబితే నిష్టూరమే!" వెళ్ళిపోయాడు డాక్టర్. బిల్లు చెల్లించి బయటకొచ్చి కారు స్టార్ట్ చేయడానికి ప్రయత్నించాడు. బండి మొండికేసింది.

కారు లాక్ చేసి, పోతున్న రిక్షాను ఆపాడు.

"ఎక్కడికి పోవాలి?" రిక్షా ఆపి అడిగాడు సూరయ్య.

"హౌసింగ్ బోర్డు!"

"ఎక్కండి... పది రూపాయలు".

"పదా... చాలా ఎక్కువ.. పదిహేనిస్తాను పోనీ.."

"పదిహేనా... అదికాదు బాబయ్యా.."

"ష్ అరవకు... ఇరవై యిస్తాపోనీ... అంతకంటే పైసా ఎక్కువ యివ్వను.." రిక్షా ఎక్కి వెనక్కి వాలిపోయాడు.

చల్లగాలి రివ్వున వీస్తున్నది. మసక వెన్నెల, చిన్నగా రాగం ఎత్తుకున్నాడు రాజశేఖర్. కాసేపటికి ఆపి సూరయ్యను అడిగాడు అతని గురించి.

"రేయ్! నువు రోజుకెంత సంపాదిస్తావురా?"

"ఏంతో లేదు బాబయ్యా.. యిర్వైకాని.. ఇరవై అయిదుకాని."

"ఏం చేస్తావురా?"

"నాకూ పెళ్ళాం ఉందండి. దానికి నాకు కూడు కావాలి. మళ్లీ పిల్ల సన్నాసులున్నారు. వాళ్ళకీ పొట్టలున్నాయి, పైగా రిక్షా బాడుగా కట్టాలి."

"మరి ఎందుకు బతుకుతున్నావురా?"

"అదేంటండి..."

"నా సంగతే చూడు లక్షలు సంపాదిస్తున్నా... కానీ లక్షలు కాదు... కోట్లు ఖర్చు పెడుతున్నా.. హహ...!" కైపు బాగా ఎక్కింది.

"మీరు మహారాజులు.."

"మహారాజా! వల్లకాడు! అంతే అది... వ్యాపారం. వస్తూంటుంది. పోతూ ఉంటుంది

కానీ ఒరే మనశ్శాంతి మటుకు ఉండదురా! ఏ రోజు కొంప మునుగుతుందో తెలీదు. ఏ రోజు ఏ యూనియన్ లీడర్‌కు తిక్కరేగి సమ్మె కట్టిస్తాడో తెలీదు. ఏరోజు ఏ వర్కర్లు, జీతాలు - బోనసులు పెంచమని అడుగుతారో తెలీదు" రాజశేఖర్ బాధగా అన్నాడు.

"అయినా మీకొచ్చే లాభాలన్నీ వాళ్ల మూలంగానే.." కోపం వచ్చింది రాజశేఖర్‌కు.

"రేయ్! మరి పెట్టుబడి మాట ఏంటి? మా తెలివి తేటలేంటి?"

రాత్రింబవళ్ళు ఆలోచించి.. ఆలోచించి బుర్రలు బద్దలుకొట్టుకునేది వీళ్ళందరికీ యివ్వడానికా?.

అతని యింటి ముందు రిక్షా ఆగింది.

"ఇదిగో ఇరవై ఉంచు." అంటూ యాభై నోటిచ్చి. తూలుకుంటూ వెళ్ళిపోయాడు.

సూరయ్య ముందు దర్మ సంకటం పడ్డా చివరికి అది దేవుడిచ్చిన డబ్బనుకుని జేబులో పెట్టుకున్నాడు.

రిక్షా అడ్డంగా మూర్తి వచ్చాడు.

"ఏం బాబుగారు.."

"అర్జెంటుగా హాస్పిటల్‌కి వెళ్ళాలి. మా యింటికిరా.. ఆవిడను ఎక్కించుకుపోవాలి..." మూర్తి రిక్షా ఎక్కి చెప్పాడు.

దాదాపు అన్‌కాన్షియస్ స్టేజిలో మల్లిక ఎక్కుతుంటే సూరయ్య ఆశ్చర్యపోయాడు.

"అదేంటి బాబుగారు... సాయంకాలం డాక్టర్ దగ్గరకెళ్ళారు."

"ఆ!అదే రాత్రి మా ప్రాణం మీదికి వచ్చింది. వాడిచ్చిన మందులు రియాక్షన్స్ ఇచ్చాయి. తొందరగా పెద్దాసుపత్రికి పోనీ.." మూర్తి ఆదుర్దాగా అన్నాడు.

"ఎలా ఉంది మల్లీ!"

"ఆ! కొంచెం, కొంచెం తగ్గుతోంది..."

"ఛీ! వెదవ జీవితం సుఖం లేదు... ఎంత సంపాదించినా చాలదు. రోగాలు, రొష్టులు"మూర్తి విసుక్కున్నాడు.

"అలా అనకండి బాబుగోరు.. మాకు కూటికి కూడా ఉండదు. నూకలు లేక పస్తులున్నా రోజులు కూడా ఉన్నాయి", రిక్షా సూరయ్య తన పరిస్థితి బేరీజు వేసుకుంటూ చెప్పాడు.

"మరి ఎవరు సుఖంగా ఉంటున్నారు? ఏ తరగతికుటుంబీకులు?" మగతగా కలవరించింది మల్లిక.

రోడ్డు వారిగా ఎవరో ముష్టివాడు పాడుతున్నాడు.

"పాపిష్టి జన్మరా..ఈ మనిషి జన్మా.. బ్రతుకంతా బాధ-బాధలన్నీ బతుకు, మెతుకులు మింగేదాకా..తప్పదు బాధ..."

(ఆదివారం ఆంధ్రభూమి 26-5-96)

